అమెరికా తెలుగు సంఘం , అమృతకిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# నైజం

-వి.ఎస్. రవిచంద్ర

'ఆమె' చాలాకాలం నుంచి కోపాన్ని దిగమింగుతూ వస్తోంది. బహుశా తన బిడ్డల్లో ప్రత్యేకించి కొందరు చేసే తప్పుడు పనులమీద కోపం కావచ్చు. అలా అణుచు కుంటూ వస్తోన్న కోపం క్రమంగా ఆగ్రహంగా మారింది.



ఆగ్రహావేశాలతో ఉడికిపోతూవున్న అమె ఇక ఆ కోపంలో వాళ్ళూ, వీళ్ళూ అనిచూడలేదు. ఒక్కసారిగా దిగ్గంతాలు దద్దరిల్లేలా పెడబొబ్బ పెట్టింది.

ఆ తెల్లవారు ఝామున అందర్నీ తనలో కలుపు కుంది.

అమె... 'భూదేవి'.

★ ★ ★

అప్పటికి ఈ 'వార్త' ప్రపంచానికి తెలిసి పద్నాలుగు గంటలైంది.

ఎటుచూసినా జనం, చెల్లాచెదురుగా పరుగెత్తుతూ...

అకస్మాత్తుగా ఊళ్లోని ఇళ్ళన్నీ రాళ్ళకుప్పలుగా మారిపోతే ఎలాంటి అయోమయావస్థలో పడిపోతామో, ఒక్కసారిగా ఇంట్లోని కుటుంబసభ్యులందరూ శవాలుగా మారిపోతే ఎంతటి విషాదానికి గురవుతామో ఇంచు మించు అందరిపరిస్థితి అలానే ఉందక్కడ.

దుఃఖా:న్ని దిగమింగుకుంటూ ఆ శిథిలాల్లో తమ కుటుంబ సభ్యుల్ని వెతుక్కుంటున్నారు కొందరు. మరికొందరు పిచ్చిగా ఏడుస్తూ వీధుల్లో తిరుగుతున్నారు.

ఒకపక్క సైనికులు శిథిలాల్లో చిక్కుకున్న వాళ్ళని వెలికితీస్తున్నారు. మరోపక్క మృతుల్ని వెతికిస్తున్నారు.

కొందరు వైద్య సదుపాయాలు కల్పించలేక అవస్థలు పడుతున్నారు.

నేనూ 'వాళ్ళ'తో పాటే తిరుగుతూ నాక్కావల్సిన వివరాలు నేను సేకరించుకుంటున్నాను.

ఎవరికీ ఆకలి దప్పుల సంగతే గుర్తుకు రావట్లేదు. ఈ విలయం చూసి ప్రకృతి కూడా రోదిస్తున్నట్టు అడపాదడపా వర్షం కురుస్తోంది.

ఇంతలో "బావజ్జీ! నీళ్ళు మంచి నీళ్ళు కావాలి" అన్న మాటలు వినిపించి వెనక్కి తిరిగి చూశాను.

ఎదురుగా చిన్నపాప - ప్రక్కనే ఉన్నది తండ్రి అనుకుంటాను మంచినీళ్ళ కోసం అడుగుతోందతడిని.

అతను మాట్లాడట్లేదు. శూన్యంలోకి చూస్తున్నట్టు కూర్చున్నాడతను.

ఒక్క మాటలో చెప్పాలంటే 'విషాదంలో ముంచి లేపినట్లు'న్నాడతడు.

చేతికి ఉన్న ఉంగరాలు, మెడలోని గొలుసూ ఒకప్పటి అతని స్థాయిని గుర్తు చేస్తున్నా, ఇప్పుడు పాపకి కనీసం మంచినీళ్ళవ్వలేని నిస్సహాయస్థితికి అతను మనసులోనే రోదిస్తున్నట్టున్నాడు.

నేను ఎయిర్‌బ్యాగ్‌లోని వాటర్‌బాటిల్ తడుము కున్నాను. అందులో నీరింకిపోయి చాలా సేపయ్యింది. నిస్పృహాయంగా పెదవి విరిచాను.

ఊళ్ళోని మంచినీటి వనరులన్నీ ఈ భూకంపంవల్ల, వర్షంవల్ల పనికిరాకుండా పోయాయ్. చిన్నగ్రామం అవడంతో ప్రభుత్వ సహాయంకూడా అంతంత మాత్రం గానే ఉంది.

ఇంతలో అతడిదృష్టి అప్పుడే వస్తున్న 'వాటర్ సప్లయ్ వ్యాను'పై పడింది. అంతే దిగ్గున లేచి అటువైపు పరుగెత్తాడు.

అతడు వ్యాను సమీపించే సరికే అందరూ వ్యానుని చుట్టుముట్టారు. అక్కడ విపరీతమైన రద్దీ ఏర్పడింది. తొక్కిసలాట మొదలైంది.

సైనికులు సర్దిచెప్పినా వినేపరిస్థితిలో లేరు జనం. కాసేపటికి నీళ్ళు సప్లయ్ చేసే ట్యాంక్ వెళ్ళిపోయింది.

ఆ గుంపులోంచి విజయగర్వంతో బయట కొచ్చాడతను చేతిలో నీటి పాత్రతో...!

కొన్నినీళ్ళు పాపకిచ్చి, మరికొన్ని అతను తాగాడు, తాగగా మిగిలిన నీళ్ళు ముఖం మీద జల్లుకుని, అలసటగా అక్కడే ఉన్న పలుకురాతి మీద కూర్చున్నా డతను.

ఇక నాలోని 'జర్నలిస్టు' ఊరుకోలేకపోయాడు. వెంటనే అతని దగ్గరకెళ్ళి అతని వివరాలు అడిగాను.

కొద్దిక్షణాలు అతను మాట్లాడలేదు.

ఆ తర్వాత ఒక్కసారి గట్టిగా నిట్టూర్చి "ఏం చెప్పమంటారు సాబ్- నేనింతకుమ్ముందు గ్రామంలో మోతుబరి రైతుని - పెద్ద ఇల్లుండేది - భార్యా ముగ్గురు పిల్లలుండేవారు... అన్నీ పోయాయ్... అందరూ పోయారు... ఇదిగో, నేనూ, ఇదీ మిగిలాం" అన్నాడు నిర్లిప్తంగా 'పాప' వైపు చూపిస్తూ.

తర్వాత కొద్దిసేపు అలావుండి పోయాడు ఎటో చూస్తూ... నేను అతణ్ణి కదిలించలేదు.

అంతలోనే మళ్ళీ "చాలా మంది పోయారు... ఒక్క 'గూడెం'లో మాత్రం పెద్దగా ప్రాణనష్టం జరగలేదు. అన్నీ 'పూరి పాక'లు కదా" అన్నాడు.

నేను నిశ్శబ్దంగా అతడి మాటల్ని రికార్డు చేస్తున్నాను.

"కనీసం ఒకరినొకరు ఓదార్చేవాళ్ళేకరువయ్యారు... అందరం 'ఏకాకుల'మైపోయాం" అన్నాడు కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా...

ఇంతలో పెద్దశబ్దం చేస్తూ ఓ వ్యాను వచ్చి ఆగింది. ఏదో స్వచ్ఛందసేవా సంస్థ పంపిన ఆహారపొట్లాల వ్యాన్ అది. అంతే అతడు లేచి అటువైపు పరుగెత్త బోయాడు.

అప్పుడడిగాను నేను "ఇంతకీ మీ పేరు?"

"బాల్‌మోరే" అని అరిచి వ్యానుకేసి పరుగు తీశాడితను.

అప్పటికే వ్యాను దగ్గర కలకలం చెలరేగింది. ఆహారపొట్లాల కోసం అందరూ ఒకేసారి ఎగబడటంతో సైనికులు వాళ్ళని అదుపుచేయలేకపోతున్నారు.

ఒకర్నొకరు తోసుకుంటున్నారు. పెనుగులాడు, కుంటున్నారు. ఈ హడావిడీ చాలదన్నట్లు జోరున వర్షం మొదలైంది.

అయినా తొక్కిసలాట తగ్గలేదు. వర్షమూ తగ్గలేదు. కాసేపటికి వ్యాను వెళ్ళిపోయింది.

అయినా ఎవరూ కదల్లేదు అక్కణ్ణుంచి. ఎక్కడున్న వారు అక్కడే ఆ శిథిలాల్లోనే కూర్చుని, ఆహార పొట్లాలు విప్పారు. క్రమ క్రమంగా చీకటి పడిపోయింది.

★ ★ ★

తెల్లారేసరికి మృతుల బంధువులతోనూ, ఈవార్త తెలిసి చోద్యం చూడ్డానికి వచ్చిన వారితోనూ ఆ చిన్న గ్రామం కిటకిటలాడిపోయింది.

ఎప్పటిలా సహాయ కార్యక్రమాలు మొదలైనా అప్పుడప్పుడూఆగి ఆగి కురుస్తోన్నవాన చాలా ఇబ్బందిని కలుగుజేస్తోంది.

కనీసం శవాల్ని దహనం చెయ్యడానికి కూడా సరిపడిన ఎండుకట్టెలు దొరక్క సామూహికంగా దహనం చేస్తున్నారు.

శిథిలాల్లోని ఇళ్ళదూలాలు విరగ్గొట్టి ఆ కట్టెలు దహనానికి ఉపయోగిస్తున్నారు.

నేను మాత్రం అన్నిచోట్లకీ కలియదిరుగుతూ ఎప్పటికప్పుడు 'న్యూస్ ఐటెమ్స్' సేకరించి పంపు తున్నాను.

సాధ్యమైనంత వరకూ అందర్నీ ఇంటర్వ్యూ చెయ్య డానికి ప్రయత్నిస్తున్నాను.

ఇంతలో దూరంగా జనం మూగి ఉండటం కన్పించింది. వెంటనే అటువైపు నుంచి వస్తోన్న జర్నలిస్ట్ మిత్రుణ్ణి అడిగాను. 'ఏమైం దక్కడని'.

"మంచినీళ్ళు, మందుల గురించి గొడవ పడు తున్నారెవరో" అన్నాడు. అటుకేసి దౌడు తీసాను.

సైనికులు సరఫరా చేసే ఆహార పొట్లాలు, పాడి దుస్తులు తెచ్చినవ్యాన్ ఆగివుందక్కడ.

దాని చుట్టూ జనం మూగి ఉన్నారు. ఆ గుంపులో నిలబడి గట్టిగా అరుస్తున్నాడో వ్యక్తి "అదంతా నాకనవసరం సాబ్- మా కులంవాడికి మాత్రం వేరుగా మందులు, నీళ్ళు, బట్టలు సరఫరా చెయ్యాల్సిందే - అయినా అందర్నీ ఒకేగాటకి కట్టేస్తే ఎలా? ఇప్పటికే దహన సంస్కారాలు లేకుండా పెట్రోలు పోసి ఎడాపెడా కాల్చేస్తున్నారు శవాల్ని" అంటున్నాడు పెద్దగొంతుతో.

ఎవరా అని పరీక్షగా చూసానతడిని.

అతను 'బాల్‌మోరే'...



క్షమించాలి

సోము: మీరు మీ దొడ్డిలో జల్లుకున్న గింజలన్నీ నిన్న మా కోడి తినేసింది, మీరు నన్ను క్షమించాలి.

రాము: ఈ రోజు మీ కోడిని మా కుక్క తినేసిందట మీరు నన్ను క్షమించాలి.

సోము: మీ కుక్క ఇందాక మా జీప్ క్రింద పడి చనిపోయింది, మీరు నన్ను క్షమించాలి!

వై. శర్వాణి,
D/o. గంగాధర్, ఇంటి నెం.2-1-12, రైల్వే బ్రిడ్జి దగ్గర,
కామారెడ్డి-503 111.

చుట్టు పక్కల కొందరు అతణ్ణి సపోర్టు చేస్తూ, మరి కొందరు వ్యతిరేకిస్తూ అరుస్తున్నారు. నినాదాలు చేస్తున్నారు.

అప్పటివరకూ ఒకరికొకరు ఓదార్పుగా, కలిసికట్టుగా పనిచేసిన వాళ్ళు కుల ప్రాతిపదికన రెండు గ్రూపులుగా విడిపోయారు.

అయినప్పటికీ ఉద్రేకపడిపోకుండా సంయమనం పాటిస్తున్నారు సైనికులు.

"అయినా 'నిన్న' అందరితోపాటే తిన్నారూ,తాగారు ఇప్పుడు కుదరదంటే ఎలా? నిన్నటికి ఇవ్వాల్టికి ఏంటి తేడా?" అన్నాడో సైనిక హవల్దార్ అనునయింపుగా.

"నిన్న వేరు - నిన్నంటే ఎవరూ లేరు నాకు - ఏకాకిని - ఈ రోజు నాకు నా వాళ్ళున్నారు - నా వెనుక మాట్లాడేవాళ్ళున్నారు - నాకు మంచీ చెడూ చెప్పడానికి ఎక్కడెక్కణ్ణుంచో వచ్చారు" అన్నాడు బాల్‌మోరే.

షాక్ తిన్నట్టుండి పోయాను నేను.

నిన్నలేని కులం ఈరోజు గుర్తొచ్చినందుకు కాదు. ఈ విచిత్రమైన మానవనైజానికి ఇంకేం మాటలు నాకు వినిపించడం లేదు. నా కనిపించిందొక్కసారి 'ఈ భవంతులు శిథిలమయ్యాయి - ఈ మనుషులూ శిథిలమయ్యారు - కాని ఇంకా మనుషుల్లో 'కుల మతాలు' శిథిలమవ్వలేదని'.

ఇంక నేనక్కడ ఉండలేకపోయాను. ఆ తర్వాతేం జరిగిందో నాకుతెలీదు.

వి.ఎస్. రవిచంద్ర
9/30, శాంతినగర్,
చోడవరం - 531 036.
విశాఖ జిల్లా